STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 114 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 06 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

ప్రజాస్వామ్యం ఖూనీ!

అధికార దుర్వినియోగం, బెదిరింపులతో అక్రమాలు



రౌడీమూకలు, పోలీసుల సాయంతో ఏకగ్రీవాలు

పోటీ చేయకుండా అడుగడుగునా అడ్డంకులు

వాగ్దానాలు అమలు చేయలేకే ఈ దొడ్డిదారులు

ముఖ్యమంత్రిపై వైఎస్ జగన్ సంచలన ఆరోపణలు

స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకుందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు.

3



వధూవరులకు ఆశీర్వచనం!



స్థానిక పోరు..

రణరంగం!

పలుచోట్ల యుద్ధక్షేత్రాన్ని తలపించిన ఓటింగ్ కేంద్రాలు

- వర్షాలను సైతం లెక్కచేయకుండా బారులు తీరిన ఓటర్లు
- దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లిన రాయలసీమ
- ఓటు పెట్టెలు పగులగొట్టి పత్రాల చించివేత
- పలుచోట్ల లాఠీప్రయోగం.. ఓటింగ్ ప్రక్రియ నిలిపివేత

ఓటు పెట్టెల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం..

రేపే వెలువడనున్న తీర్పు

అమరావతి, నవంబర్ 5 (సమయం న్యూస్) : రాష్ట్రంలో ప్రాదేశిక (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. అయితే ఐదు గంటలు దాటిన తర్వాత కూడా వరుసలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజలు అత్యుత్సాహంతో ఓటింగ్ కేంద్రాలకు తరలిరాగా.. పలు జిల్లాల్లో మాత్రం రాజకీయ పక్షాల ఘర్షణలతో వాతావరణం భగ్గుమంది. టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య పలుచోట్ల దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకోవడంతో కొన్ని కేంద్రాలు యుద్ధక్షేత్రాన్ని తలపించాయి. వృద్ధులు, మహిళలు, గర్భిణులు, యువత సైతం ఓటేసేందుకు ఆసక్తి చూపారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం ఓటు పెట్టెల్లో నిక్షిప్తమైంది. శనివారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అనంతపురం,

మిగతా 2 లో



వరుసలో నిలబడి!

సామాన్య ఓటరులా మంత్రి అచ్చెన్నాయుడు ఓటు

నిమ్మాడ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి..

2

తన వంతు వచ్చే వరకు సాధారణ ఓటర్లతో పాటే నిరీక్షణ

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు



ఓటు పెట్టెలకు పటిష్ఠ భద్రత!

భద్రతా గదుల వద్ద భారీ బందోబస్తు

వివరాలు వెల్లడించిన హరీశ్‌కుమార్ గుప్తా

.. వివరాలు 2లో



ప్రశాంతంగా స్థానిక పోరు!

ఏర్పాట్ల పట్ల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంతృప్తి

.. వివరాలు 2లో



పోలింగ్ విధుల్లో విషాదం!

గుండెపోటుతో కుప్పకూలిన మహిళా అధికారి

ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి

.. వివరాలు 2లో



మురసు తుఫానుతో రూ.1,918 కోట్ల నష్టం!

2

ప్రాథమిక అంచనాలు వెల్లడించిన అధికారులు

1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

ఉన్నతాధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

వైకుంఠ దర్శనాలకు పకడ్బందీ ఏర్పాట్లు!

తొలి మూడు రోజులు ఈ-డిప్ ద్వారా ఎస్ఎస్డీ టోకెన్లు

ఏర్పాట్లపై అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశాలు



3



ఎబోలాపై అలర్ట్!

3

ఏపీలో ముందస్తు చర్యలు ముమ్మరం

విమానాశ్రయాల్లో ప్రయాణికులకు స్క్రీనింగ్

నవంబర్ 12న రాష్ట్రవ్యాప్తంగా మాక్‌డ్రిల్

సిద్ధంగా ఐసోలేషన్ పడకలు, పీపీఈ కిట్లు



అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది!

గోకుల్ డెయిరీ ఎన్నికలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

4

పాడి రైతుల తీర్పును తారుమారు చేస్తున్నారని మండిపాటు

ఇటీవల మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో జరిగిన గోకుల్ మిల్క్ కోఆపరేటివ్ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేయడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు.

కొత్త ఓటర్ల నమోదులో కీలక మార్పులు!

ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్‌ను వేరు చేసిన ఈసీ

4





ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధం

రాహుల్‌కు అమిత్ షా సవాల్!

.. వివరాలు 4లో



ఏపీలో ప్రశాంతంగా స్థానిక పోరు!

ఏర్పాట్ల పట్ల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంతృప్తి

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ఓటింగ్ కేంద్రాల పరిశీలన

ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేవన్న అనిల్ చంద్ర పునేఠ

విజయవాడ, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రాదేశిక (ఎంపీటీసీ, జెడ్పీటీసీ) ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. గురువారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు ఓటింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైల్వే కోచ్ నిర్మాణ కేంద్రం, విజయవాడ రూరల్ మండలం పాతపాడు, గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఓటింగ్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి పునేఠ వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని ఓటర్లు, సిబ్బంది ఆయనకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టిందని, రాజకీయ పార్టీలు కూడా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నాయని ఆయన కితాబునిచ్చారు.

కట్టుదిట్టమైన భద్రత..

సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ పూర్తవుతుందని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఓటు పెట్టెలను పటిష్ఠ భద్రత మధ్య భద్రతా గదులకు (స్ట్రాంగ్ రూమ్) తరలిస్తామని, స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత కట్టుదిట్టంగా భద్రపరుస్తామని వివరించారు. తాను సందర్శించిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేశామని, ఓటు పెట్టెలను భద్రపరిచే గదుల్లోనూ నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. కృష్ణా జిల్లా ఎన్నికల పరిశీలకుడు వి.అభిషేక్‌తో కూడా ఆయన ఎన్నికల సరళిపై చర్చించారు. పోలింగ్ ముగియడానికి ఇంకా సమయం ఉన్నందున ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ విధుల్లో విషాదం!

గుండెపోటుతో కుప్పకూలిన మహిళా అధికారి

ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి

కడదరకుంట ఓటింగ్ కేంద్రంలో బాధాకర ఘటన



అనంతపురం, నవంబర్ 5 (సమయం న్యూస్): అనంతపురం జిల్లా కూడేరు మండలం కడదరకుంటలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా అధికారి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. కడదరకుంట ఓటింగ్ కేంద్రంలో సహాయ పోలింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న హరిత గౌడ్ (58) అనే ఉపాధ్యాయురాలికి అకస్మాత్తుగా శ్వాస సంబంధిత సమస్య తలెత్తింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే స్పందించిన అక్కడి వైద్య బృందం మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్తుండగానే మార్గమధ్యంలో ఆమె తుదిశ్వాస విడిచారు. మృతురాలు హరిత గౌడ్ రాయదుర్గం మండలంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి ఆకస్మిక మరణంతో తోటి సిబ్బందితో పాటు స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.

మంత్రి పయ్యావుల తీవ్ర విచారం..

విధి నిర్వహణలో ఉన్న మహిళా అధికారి హరిత మృతి పట్ల రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఓటింగ్ కేంద్రంలోనే ఆమె మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హరిత మృతి పట్ల ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రార్థించారు.

ఆ కుటుంబానికి అండగా ఉంటాం!

మహిళా అధికారి హరిత మృతి పట్ల ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

అమరావతి, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఎన్నికల విధుల్లో ఉంటూ ఆకస్మికంగా మృతి చెందిన మహిళా అధికారి హరిత (58) కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన ఉపాధ్యాయురాలి మృతి పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంట ఎన్నికల కేంద్రంలో విధులు నిర్వహిస్తూ తీవ్ర అస్వస్థతకు గురై ఆమె మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం ఆ కుటుంబానికి వెన్నంటే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

స్థానిక పోరు..రణరంగం!

(మొదటి పేజీ తరువాయి..)

కడప, కర్నూలు జిల్లాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రిపల్లె, తిరుపతి జిల్లా నల్లపురెడ్డిపల్లి వద్ద పెట్రోలు బాంబులతో దాడులు జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. తుమ్మలపల్లిలో రాళ్లు, సీసాలతో దాడులు చేసుకున్నారు. నల్లపురెడ్డిపల్లిలో టీడీపీ నేతల వాహనాలపై దాడులు జరిగాయి. నందలూరులో తిరుపతి, జమ్మలమడుగు నుంచి జీపుల్లో వచ్చిన బయటి వ్యక్తులను స్థానికులే అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. కర్నూలు జిల్లా కోసిగి మండలం ఆర్లబండలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరగ్గా.. చిప్పగిరి మండలం గుమ్మనూరులో టీడీపీ, బీజేపీ కార్యకర్తలు కారంపొడి చల్లుకుని కొట్టుకున్నారు. ముందుజాగ్రత్తగా శిల్పా రవి, శిల్పా చక్రపాణి రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తదితర నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

ఓటు పెట్టెల ధ్వంసం.. నేతలపై దాడులు..

అనంతపురం జిల్లా కూడేరు మండలం మరుట్ల పోలింగ్ కేంద్రంలోకి చొరబడిన కొందరు నాయకులు.. ఏకంగా ఓటు పెట్టెను బయటకు లాక్కొచ్చి పగులగొట్టి, బ్యాలెట్ పత్రాలను బయటపడేశారు. అడ్డుకునేందుకు యత్నించిన ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. కుందుర్పి మండలం బెస్తరపల్లిలో కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రపై దాడికి యత్నించగా ఆయన భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లిలో పోలీసులను బయటకు పంపి కొందరు నాయకులు బూత్‌కు తాళం వేయడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. పెద్దముడియం మండలం గుండ్లకుంటలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కుమారుడు టీడీపీ ప్రతినిధులను బయటకు నెట్టేశారు.

లాఠీచార్జ్.. ఓటింగ్ నిలిపివేత..

పోలింగ్ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన అల్లర్లను అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కింగువలో దాడులకు దిగిన వర్గాలపై పోలీసులు లాఠీప్రయోగం చేశారు. గరివిడిలో జనసేన నాయకురాలిపై ఓ వైసీపీ నేత దాడి చేయడంతో ఉద్రిక్తత రేగింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఆరుంబాకలో దొంగ ఓట్ల ఆరోపణలతో రెండు గంటల పాటు ఓటింగ్ నిలిచిపోయింది. గుంటూరు జిల్లా పెదకాకాని, ఎన్టీఆర్ జిల్లా కలగర, ఇబ్రహీంపట్నం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, పల్నాడు జిల్లా లంకెలకూరపాడు తదితర ప్రాంతాల్లో రాజకీయ పార్టీల శ్రేణులు తీవ్ర వాగ్వాదానికి, తోపులాటకు దిగారు.



వర్షంలోనూ వెరవని ఓటర్లు..

మరోవైపు భారీ వర్షాలు కురుస్తున్నా ఓటర్లు వెనక్కి తగ్గలేదు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో మురసు తుఫాన్ కారణంగా భారీ వర్షం కురిసి 15 కేంద్రాల్లోకి మోకాళ్ల లోతు నీరు చేరింది. అయినా ప్రజలు ఆటోలు, ట్రాక్టర్లలో వెళ్లి మరీ ఓటేశారు. ప్రకాశం, బాపట్ల, కాకినాడ, నెల్లూరు జిల్లాల్లో వర్షంలోనే ప్రజలు వరుసల్లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోటీ నుంచి తప్పుకున్న అభ్యర్థులు..

ఎన్టీఆర్ జిల్లా నాగులూరులో వైసీపీ అభ్యర్థి ఏకంగా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం కలకలం రేపింది. సొంత పార్టీ నేతల నుంచి సహకారం లేనందునే బరి నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన సామాజిక మాధ్యమాల సమూహంలో సందేశం పంపారు. కడప జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా చిన్నమండెం స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. కృష్ణా జిల్లా గన్నవరంలో ఓ వృద్ధురాలు నడవలేక ఇబ్బంది పడుతుండటం గమనించిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు.. ఆమెను స్వయంగా ఎత్తుకుని వెళ్లి ఓటు వేయించారు. ఆయన చూపిన ఈ మానవత్వానికి స్థానికుల నుంచి విశేష ప్రశంసలు దక్కాయి

హోదా పక్కనపెట్టి.. వరుసలో నిలబడి!

- సామాన్య ఓటరులా మంత్రి అచ్చెన్నాయుడు ఓటు
- నిమ్మాడ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి..
- తన వంతు వచ్చే వరకు నిరీక్షణ
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు

శ్రీకాకుళం, నవంబర్ 5 (సమయం న్యూస్): అధికారిక హోదా కంటే ప్రజాస్వామ్య విలువలే గొప్పవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆచరణలో చాటిచెప్పారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రంలో సామాన్య ఓటరుగా వరుసలో నిలబడి ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు కూడా ఓటు వేశారు. మంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యం ఆశించకుండా ఇతర ఓటర్లతో కలిసి సాధారణ వరుసలో నిలబడి తన వంతు వచ్చే వరకు ఆయన



వేచి ఉన్నారు. తద్వారా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడూ సమానమేనన్న సందేశాన్ని అచ్చెన్నాయుడు సమాజానికి చాటిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడంలో సామాన్యుడైనా, ప్రజాప్రతినిధైనా అందరూ సమానమేనని ఆయన తన చర్యతో నిరూపించారు.

ఓటే శక్తిమంతమైన ఆయుధం..

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులని స్పష్టం చేశారు. ఓటు అనేది కేవలం గుర్తుపై వేసే ముద్ర కాదని, ప్రజల భవిష్యత్తును, సమాజ గతిని నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధమని ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది అని, ప్రతి ఓటుకూ ఎంతో విలువ ఉందన్నారు. ఒక్క ఓటు కూడా ప్రజాతీర్పును మార్చగలదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలాంటివని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు వేయడం కేవలం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తు పట్ల ప్రతి పౌరుడికీ ఉన్న కనీస బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చైతన్యవంతమైన ఓటర్లే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఓటు పెట్టెలకు పటిష్ఠ భద్రత!

భద్రతా గదుల వద్ద భారీ బందోబస్తు

వివరాలు వెల్లడించిన హరీశ్‌కుమార్ గుప్తా

ప్రశాంతంగా ముగిసిన స్థానిక ఎన్నికలు

15 జిల్లాల్లో జరిగిన 37 చెదురుమదురు ఘటనలు

అమరావతి, నవంబర్ 5 (సమయం న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా ముగిసిన ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించిన ఓటు పెట్టెలు ఉంచే భద్రతా గదుల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో అంకితభావంతో పని చేసిన సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఎన్నికల పోరులో 15 జిల్లాల పరిధిలో 37 ఘటనలు జరిగినట్లు ఆయన వివరించారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఓటింగ్ ప్రక్రియకు, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు.



మురసు తుఫానుతో రూ.1,918 కోట్ల నష్టం!

- ప్రాథమిక అంచనాలు వెల్లడించిన అధికారులు
- 1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటాలు
- ఉన్నతాధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి
- నేడు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- వేగంగా కొనసాగుతున్న సహాయక, పునరుద్ధరణ చర్యలు

అమరావతి, నవంబర్ 5 (సమయం న్యూస్) : మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏకంగా రూ.1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మురసు తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా జరిగిన నష్టాన్ని, చేపట్టిన సహాయక చర్యల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం స్వయంగా తానే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. మురసు తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదికను త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

లక్షలాది హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు..

ఈ సందర్భంగా అధికారులు వెల్లడించిన ప్రాథమిక అంచనాల ప్రకారం.. మురసు తుఫాను కారణంగా రాష్ట్రానికి సుమారు రూ.1,918.55 కోట్ల మేర నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులపై తీవ్ర ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 6,749 హెక్టార్లలో దెబ్బతినగా, 12,586 మంది రైతులు నష్టపోయారు. భారీ వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. అయితే నీట మునిగిన పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు మరో 48 నుంచి 72 గంటల సమయం అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ తుఫాను కారణంగా బాపట్ల జిల్లాలో ఐదుగురు, గుంటూరు జిల్లాలో ఇద్దరు, పల్నాడు జిల్లాలో ఒకరు చొప్పున మొత్తం ఎనిమిది మంది మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు..

మరోవైపు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న వేలాది విద్యుత్ స్తంభాలు, సరఫరా కేంద్రాలను ఇప్పటికే బాగు చేశారు. దెబ్బతిన్న రాష్ట్ర, జిల్లా స్థాయి రహదారులు, గ్రామీణ రహదారుల మరమ్మతు పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. నేలకొరిగిన చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. గురువారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా చరవాణి గోపురాల సేవలు 97.1 శాతం మేర పునరుద్ధరించబడ్డాయి. బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మాత్రమే కొన్నిచోట్ల పనులు జరగాల్సి ఉంది. పారిశుద్ధ్య పనుల కోసం వేలాది బృందాలు, వందలాది విద్యుత్ జనరేటర్లను వినియోగిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ.. వేగంగా సాయం..

ప్రకాశం బ్యారేజీతో పాటు పలు ప్రాజెక్టులు, కాలువలకు వస్తున్న వరద నీటి ప్రవాహాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ 60 గేట్లు తెరిచి ఉంచి దిగువకు వరదను విడుదల చేస్తున్నారు. తుఫాను సహాయక చర్యల్లో రాష్ట్ర, జాతీయ విపత్తు స్పందన దళాలతో పాటు అగ్నిమాపక సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు. ముందస్తుగా కోట్లాది హెచ్చరిక సందేశాలను ప్రజలకు పంపించారు. బాధితులకు వేలాది ఆహార పొట్లాలు, తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు సేవలందించారు. తక్షణ సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాలకు రూ.37 కోట్లు విడుదల చేసిందని, మౌలిక వసతుల మరమ్మతులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఎన్నికల ముసుగులో ప్రజాస్వామ్యం ఖూనీ!

- అధికార దుర్వినియోగం, బెదిరింపులతో అక్రమాలు
- రౌడీమూకలు, పోలీసుల సాయంతో ఏకగ్రీవాలు
- పోటీ చేయకుండా అడుగడుగునా అడ్డంకులు
- వాగ్దానాలు అమలు చేయలేకే ఈ దొడ్డిదారులు
- ముఖ్యమంత్రిపై వైఎస్ జగన్ సంచలన ఆరోపణలు



తాడేపల్లి, నవంబర్ 5 (సమయం న్యూస్) : స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకుందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. శకుని పాచికల్లా మొత్తం ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకున్నారని, రౌడీలు, పోలీసుల సాయంతో స్థానిక పోరులో అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

ముఖం చూపించలేకే అక్రమాలు..

కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు ప్రధాన హామీలు, వందల సంఖ్యలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయారని జగన్ విమర్శించారు. ప్రతి ఇంటికీ బాండ్లు పంచిపెట్టి, జూన్ నుంచి ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక ప్రజలకు ముఖం చూపించే ధైర్యం లేకే స్థానిక పోరును ఇలా ప్రభావితం చేశారని దుయ్యబట్టారు. వేలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పూచీకత్తుల పేరుతో ఠాణాలకు పిలిపించి, బెదిరించి అక్రమ అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోటీకి ముందే కక్షసాధింపు..

రాష్ట్రవ్యాప్తంగా 17 పురపాలక సంఘాల్లో తమ పార్టీ అధ్యక్ష అభ్యర్థులను కనీసం పోటీ పత్రాలు కూడా వేయనివ్వలేదని జగన్ ఆరోపించారు. మరో 22 పురపాలక, నగర పాలక సంస్థల్లో తొలి దశలోనే అక్రమంగా ఏకగ్రీవమయ్యేలా కుట్రలు చేశారన్నారు. పులివెందులలో 40 వార్డులు ఉంటే కేవలం 20 వార్డుల్లో మాత్రమే తమ అభ్యర్థులు పత్రాలు వేయగలిగారని ఆయన వివరించారు.

నిఘా కెమెరాలు పెట్టకుండానే..

అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం పోటీ పత్రాల దాఖలు నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాల వరకు ఎక్కడా పూర్తిస్థాయిలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయలేదని జగన్ తప్పుబట్టారు. పురపాలక ఎన్నికల్లో 11,378 కేంద్రాలకు గాను 5,737 చోట్ల, ప్రాదేశిక ఎన్నికల్లో 31,460 కేంద్రాలకు గాను కేవలం 16,064 కేంద్రాల్లోనే కెమెరాలు పెట్టారన్నారు. పత్రాల పరిశీలన, ఓటింగ్ కేంద్రాలు, నమోదు శాతం, రాత్రిపూట ఓటు పెట్టెల భద్రత.. ఇలా ప్రతి దశలోనూ భారీగా అవకతవకలు జరిగాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయనకు వత్తాసు పలికే అధికారులు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘం అందరూ కుమ్మక్కై వ్యవస్థను భ్రష్టుపట్టించారని జగన్ ఆరోపించారు. ఇది నిజమైన ఎన్నికల ప్రక్రియో లేక ముందే నిర్ణయించిన ఎంపికో ప్రజలే ఆలోచించాలని ఆయన కోరారు.



వధూవరులకు ఆశీర్వచనం!

చెన్నైలో వివాహ వేడుకకు హాజరైన వైఎస్ జగన్ దంపతులు

శ్రేయ, ఉజ్వల్‌లకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ముఖ్యమంత్రి

వేడుకలో పాల్గొన్న తమిళనాడు ముఖ్యమంత్రి, గౌతమ్ అదానీ, కేటీఆర్

చెన్నై, నవంబర్ 5 (సమయం న్యూస్) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సతీమణి వైఎస్ భారతితో కలిసి చెన్నైలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. చెన్నైలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో వైఎస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహం ఉజ్వల్‌తో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన జగన్ దంపతులు నూతన వధూవరులు శ్రేయ, ఉజ్వల్‌లను ఆశీర్వదించి, హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆనందంగా దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకలో తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, వైఎస్ విజయమ్మతో పాటు పలువురు రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ దర్శనాలకు పకడ్బందీ ఏర్పాట్లు!

- పది రోజుల వైకుంఠ ద్వార దర్శనంపై అధికారుల సమీక్ష
- తొలి మూడు రోజులు ఈ-డిప్ ద్వారా ఎస్ఎస్డీ టోకెన్లు
- భక్తుల క్యూలైన్ల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్
- ఏర్పాట్లపై అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశాలు



తిరుమల, నవంబర్ 5 (సమయం న్యూస్) : డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో గురువారం ఆయన సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

సామాన్య భక్తులకే పెద్దపీట..

గత ఏడాది రికార్డు స్థాయిలో 7.83 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించిన ఉత్సాహంతో.. ఈసారి కూడా అత్యంత విజయవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. అధికశాతం సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో లాగానే తొలి మూడు రోజులకు ఆన్‌లైన్‌లో ఈ-డిప్ ద్వారా ఎస్ఎస్డీ టోకెన్లు కేటాయించాలని, తర్వాతి ఏడు రోజులు అందరికీ సర్వదర్శనం అమలు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 25న శుక్రవారం స్వామివారి అభిషేక సేవ సమయంలోనూ భక్తులకు దర్శనం కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిఘా..

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సామాన్య భక్తులకు త్వరగా దర్శనం కలిగేలా చూడాలన్నారు. చివరి ఏడు రోజుల్లో భక్తుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు. తిరుమలలో పార్కింగ్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ మనోహరం, డిప్యూటీ ఈవోలు భాస్కర్, రాజేంద్ర, వేంకటేశ్వర్లు, సోమన్నారాయణ, రమాకాంత్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ కుమారి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఐటీ జీఎం వేంకటేశ్వర్లు నాయుడు, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, వేణుగోపాల్, వీజీవో సురేంద్ర, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ విచారణ ఏపీలోనే!

బదిలీ పిటిషన్ తిరస్కరణ.. స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

సిట్ దర్యాప్తు కొనసాగింపు..సీజేఐ ధర్మాసనం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడిన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను ఆంధ్రప్రదేశ్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. విచారణను వేరే రాష్ట్రానికి మార్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, ఏపీలోనే న్యాయ ప్రక్రియ కొనసాగేందుకు అనుమతించింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై పలువురు నేతలు, భక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో విచారణ నిష్పాక్షికంగా జరిగే అవకాశాలపై సందేహాలు వ్యక్తం చేస్తూ, కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం ఇందుకు ఏమాత్రం అంగీకరించలేదు. కేసు బదిలీ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. గతంలోనే విచారణ పారదర్శకంగా సాగేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు కోర్టు ఆదేశించిన నేపథ్యంలో, ప్రస్తుత కేసు విచారణ ఏపీలోనే కొనసాగనుంది.

ఎబోలాపై అలర్ట్!


- ఏపీలో ముందస్తు చర్యలు ముమ్మరం
- విమానాశ్రయాల్లో ప్రయాణికులకు స్క్రీనింగ్
- నవంబర్ 12న రాష్ట్రవ్యాప్తంగా మాక్‌డ్రిల్
- సిద్ధంగా ఐసోలేషన్ పడకలు, పీపీఈ కిట్లు



అమరావతి, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. తిరుపతి, భోగాపురం, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అనుమానిత లక్షణాలున్న ప్రయాణికులకు స్క్రీనింగ్ నిర్వహించేందుకు వైద్య సిబ్బందిని సిద్ధం చేసింది. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు ఓడరేవుల్లోనూ వైద్య పరీక్షలకు ఏర్పాట్లు చేస్తోంది.

సిద్ధంగా ఐసోలేషన్ కేంద్రాలు..

ఎబోలా వైరస్ నివారణకు రాష్ట్రంలో తీసుకుంటున్న చర్యలపై గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఇందులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ వివరాలు వెల్లడించారు. ఎంపిక చేసిన ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మొత్తం 46 ఐసోలేషన్ పడకలు, 3,288 పీపీఈ కిట్లు, 104 నమూనా సేకరణ కిట్లు, ఐదు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో వైద్య సన్నద్ధతను పరీక్షించేందుకు నవంబర్ 12న ప్రత్యేకంగా మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



21 రోజుల ప్రయాణ చరిత్రపై నిఘా..

ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల గత 21 రోజుల ప్రయాణ చరిత్రను పరిశీలించాలని కేంద్ర అధికారులు సూచించారు. లక్షణాలు లేని ప్రయాణికులు ఇంటి వద్ద స్వీయ పర్యవేక్షణలో ఉండాలని, వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారిని 21 రోజుల పాటు వైద్య పర్యవేక్షణలో ఉంచాలని తెలిపారు. విమాన ప్రయాణ సమయంలో ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వారిని ఇతర ప్రయాణికుల నుంచి వేరు చేయాలన్నారు. అనుమానిత లక్షణాలు కనిపిస్తే ప్రత్యేక అంబులెన్స్‌లో ఐసోలేషన్ ఆసుపత్రికి తరలించాలని స్పష్టం చేశారు.

ఐదు దేశాల్లో కేసులు.. మూడు ల్యాబ్‌ల్లో పరీక్షలు..

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 31 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఐదు దేశాల్లో 10,498 నిర్ధారిత ఎబోలా కేసులు, 5,107 మరణాలు నమోదయ్యాయి. ప్రస్తుత వ్యాప్తికి బుండిబుగ్యో వైరస్ రకం కారణమని అధికారులు పేర్కొన్నారు. ఎబోలా అనుమానిత నమూనాల పరీక్షలకు పుణెలోని ఐసీఎంఆర్-ఎన్ఐవీతో పాటు రాష్ట్రంలోని మూడు ల్యాబ్‌లను వినియోగించనున్నారు. విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజ్, తిరుపతి స్విమ్స్, విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజీల్లో ఈ నమూనాల పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

నెలలోగా తేల్చేయండి!

కమిటీకి సుప్రీం ఆదేశం.. జంతర్ మంతర్ హింసపై విచారణ

రహస్య ఫిర్యాదులకు పోర్టల్..వీడియో ఆధారాల పరిశీలన

డిసెంబర్ 2కు వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : గత జూలైలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన హింసాత్మక ఘటనలు, పోలీసుల తీరుపై విచారణ జరుపుతున్న ఉన్నత స్థాయి కమిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నెల రోజుల్లోగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి చూడాల్సిన పనిలేదని తేల్చిచెప్పింది.

తక్కువగా వచ్చిన ఫిర్యాదులు..

జూలై 20న పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏకంగా 149 పత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని కమిటీ కోర్టుకు తెలిపింది. అక్టోబర్ 21న మరోసారి విజ్ఞప్తి చేసినా ఆన్‌లైన్, నేరుగా వచ్చిన ఫిర్యాదులు చాలా తక్కువగా ఉన్నాయని వివరించింది. తగిన ఆధారాలు లేకపోవడంతో ఇప్పటివరకు ఓ నిర్ధారణకు రాలేకపోయామని తెలపగా.. దీనిపై స్పందించిన ధర్మాసనం మరో నెల రోజుల గడువు ఇచ్చింది.

అఫిడవిట్లు, వీడియోలే ఆధారం..

పిటిషనర్లు సమర్పించిన అఫిడవిట్లు, వీడియో రికార్డుల్లోని ఆధారాలను పరిశీలించి నివేదిక రూపొందించాలని కోర్టు ఆదేశించింది. బాధితులు, సాక్షులు భయం లేకుండా ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఓ ప్రత్యేక పోర్టల్ ప్రారంభించినట్లు కమిటీ తెలిపింది. కీలక విషయాలను అన్ని పక్షాలతో పంచుకోవాలని ధర్మాసనం సూచించింది. నిరసనకారులపై పోలీసులు వాడిన ఆయుధాల వివరాలను కమిటీకి ఎందుకు ఇవ్వలేదని పిటిషనర్లు ప్రశ్నించగా.. ఆ సమాచారాన్ని సేకరించే పనిలో కమిటీ ఉండవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి విచారణను డిసెంబర్ 2కు వాయిదా వేసింది.



కొత్త ఓటర్ల నమోదులో కీలక మార్పులు!

ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్‌ను వేరు చేసిన ఎన్నికల సంఘం

ఇకపై ప్రత్యేకంగా సమర్పించాల్సిన ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రం

దేశంలోని అన్ని రాష్ట్రాలకు కొత్త విధానం వర్తింపు

ఈసీ సమావేశాల అజెండా, నిర్ణయాల నమోదు తప్పనిసరి

విదేశీ పర్యటనలకు ముందస్తు అనుమతి..

సాంకేతిక వ్యవస్థల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేపట్టింది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో సమర్పించే ఫారం-6 నుంచి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ధ్రువీకరణ పత్రాన్ని వేరు చేసింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ కొత్త విధానం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తాజా మార్పులతో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునేవారు ఫారం--6తోపాటు ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సిన అవసరం ఉండదని, అవసరమైన సందర్భాల్లో దానిని ప్రత్యేకంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతోపాటు పరిపాలనలో పారదర్శకత పెంచడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. ఎన్నికల సంఘం అంతర్గత పరిపాలనా వ్యవస్థలోనూ పలు మార్పులు తీసుకొచ్చింది. అధికారిక సమావేశాల నిర్వహణలో స్పష్టత, జవాబుదారీతనం పెంచేందుకు కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇకపై ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశాలకు సంబంధించిన అజెండాను ముందుగానే సభ్యులకు అందించాల్సి ఉంటుంది. సమావేశం ముగిసిన తర్వాత చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను అధికారికంగా నమోదు చేసి సమావేశ వివరాలను జారీ చేయడం తప్పనిసరి చేసింది. గతంలో ఈ విధానం కచ్చితంగా అమలులో లేకపోవడంతో నిర్ణయాల నమోదు, సమాచార నిర్వహణలో మరింత స్పష్టత తీసుకురావాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘంలో పనిచేసే అధికారులు విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలని నిర్ణయించింది. అధికారిక విధులకు సంబంధించిన విదేశీ పర్యటనల విషయంలో నియంత్రణ, పర్యవేక్షణ పెంచేందుకు ఈ నిబంధనను తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త సమాచార సాంకేతిక వ్యవస్థల రూపకల్పన, పరిశీలన, ఆమోద ప్రక్రియలోనూ మార్పులు చేపట్టింది. గతంలో కొత్త సాంకేతిక వ్యవస్థల ఆమోదానికి సంబంధించి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తిన నేపథ్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇకపై కొత్త సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన ప్రతిపాదనలను తొలుత ఈ కమిటీ పరిశీలించనుంది. వాటి అవసరం, పనితీరు, అమలు సాధ్యాసాధ్యాలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన తర్వాతే తుది ఆమోదం కోసం ఎన్నికల సంఘం ముందుకు తీసుకురానుంది. మొత్తంగా ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాన్ని వేరు చేయడం కొత్త ఓటర్ల నమోదు విధానంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం


దుబాయ్‌లో సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్ అరెస్ట్

మరో నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను రప్పించే ప్రయత్నాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ యాప్ సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్‌ను దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భారత భద్రతా వర్గాలకు సమాచారం అందింది. మరో ప్రధాన నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను ఒమన్ నుంచి భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఉప్పల్ పట్టుబడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా సాగిన ఈ బెట్టింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు వర్గాలకు సంబంధాలున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో ఆరోపణలు వెలుగుచూశాయి. బెట్టింగ్ కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు కొందరు నేతలు రాజకీయ అండదండలు అందించగా, ఉన్నతాధికారులు, పోలీసులకు నెలవారీగా భారీ మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. యాప్ ప్రచారం, సాంకేతిక కార్యకలాపాలను చంద్రకర్ పర్యవేక్షించగా.. రాజకీయ నేతలు, అధికారులతో సెటిల్‌మెంట్లు, హవాలా మార్గాల్లో నగదు బదిలీల బాధ్యతలను ఉప్పల్ చూసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈడీ అంచనాల ప్రకారం మహాదేవ్ యాప్, దాని అనుబంధ వేదికల ద్వారా సుమారు రూ.94 వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. ప్రమోటర్లకు రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయం చేరినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఇందులో అధిక భాగం హవాలా మార్గాల్లో విదేశాలకు తరలించగా, కొంత మొత్తం రాజకీయ నాయకులు, అధికారులకు చేరినట్లు ఆరోపణలున్నాయి. 2023 అక్టోబర్‌లో జారీ చేసిన ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఉప్పల్‌ను దుబాయ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఈ పరిణామంపై యూఏఈ ప్రభుత్వ వర్గాల నుంచి భారత విదేశాంగ శాఖకు అధికారిక సమాచారం అందాల్సి ఉంది. దౌత్య మార్గాల ద్వారా ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు సంస్థలు చర్యలు చేపట్టాయి. ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చి విచారిస్తే బెట్టింగ్ సొమ్ము ఎవరెవరికి చేరింది? రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల పాత్ర ఎంత? హవాలా లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తులెవరు? అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ఆస్తుల సమీకరణకు ఈ నిధులు వినియోగించారన్న ఆరోపణలపైనా విచారణ జరగనుంది.

ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధం

- **రాహుల్‌కు అమిత్ షా సవాల్!**
- **ప్రధాని మోదీతో చర్చ కావాలంటే అధికారికంగా లేఖ రాయండి**
- **అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సిద్ధమని ప్రకటన**
- **బోగస్ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోంది?**
- **చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందే**
- **వీధుల్లో ఆందోళనలు కాదు.. పార్లమెంట్‌లో చర్చించాలని సూచన**



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపు వంటి అంశాలపై చర్చించేందుకు అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై వీధుల్లో ఆందోళనలు చేయడం కంటే పార్లమెంట్ వేదికగా చర్చించడం సముచితమని పేర్కొన్నారు. హరియాణాలోని కర్నాల్‌లో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా మాట్లాడారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం వల్ల ప్రయోజనం ఏమిటని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను తొలగించే ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. దేశంలో అక్రమంగా ప్రవేశించిన వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉంటే వాటిని తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడటం ఎన్నికల వ్యవస్థకు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ కార్యకలాపాలను కాంగ్రెస్ అడ్డుకుంటోందని అమిత్ షా ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నేతలు చట్టసభల్లో చర్చలకు ముందుకు రావాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలపై ఉన్న సందేహాలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రత్యేక సమావేశాల నిర్వహణకు కూడా వెనుకాడబోమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజలకు సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అన్నారు. ఈ సందర్భంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం ముఖ్యమని చెప్పారు. ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లను గుర్తించి తొలగించడాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. మరోవైపు నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రజలను ప్రభావితం చేస్తున్న కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో ఒకే వేదికపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశంలోని 73 శాతం మంది యువత ఇద్దరు నేతల మధ్య చర్చను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై దేశ అగ్రనేతలు బహిరంగంగా చర్చించడం ప్రజాస్వామ్యానికి అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. అయితే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.



భారీగా పెరిగిన బంగారం ధర

ఒక్క రోజే రూ.5వేలు పైకి..

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ పడిపోవడం తదితర కారణాలతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయంగా వీటి ధరలు పెరుగుతున్నాయి. ఆ ప్రభావంతో దేశీయంగానూ బంగారం, వెండి ధరలు దూసుకెళ్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మేలిమి 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1.49లక్షలకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.5వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1.35లక్షలు పలికింది. అటు వెండిపై గురువారం ఒక్కరోజే దాదాపు రూ.9వేలు పెరిగింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.04లక్షలకు చేరింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4129 డాలర్లకు ఎగబాకింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైనే పెరగడం గమనార్హం. ఇక, ఔన్సు వెండి ధర 52.83 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబరు డెలివరీ బంగారం 10 గ్రాములు రూ.1.45 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.89లక్షల వద్ద కొనసాగుతోంది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలతో డాలరు విలువ క్షీణించింది. దీంతో కేంద్ర బ్యాంకులు బంగారం కొనొచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు, డిసెంబరులో ఫెడ్ వడ్డీరేట్లు పెరగకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత పరిణామాల దృష్ట్యా మదుపర్లు తమ పెట్టుబడులను బంగారం, వెండిపైకి మళ్లిస్తుండటం వీటి ధరల పెరుగుదలకు కారణమైంది. ఇదిలా ఉండగా.. దీపావళికి ముందు వచ్చే ధన్‌త్రయోదశి నేపథ్యంలోనూ ఈ లోహాలకు గిరాకీ పెరిగిందని బులియన్ వర్గాలు వెల్లడించాయి.

నిర్బంధం నుంచే 24 గంటలు!

పోలీసులు అరెస్టు నమోదు ఆలస్యం చేసినా గడువు పొడిగించలేరు

విచారణ, దర్యాప్తు పేరుతో నిర్బంధ సమయాన్ని మినహాయించడానికి వీల్లేదు

గడువు దాటితే విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్ల పర్యవేక్షణ తప్పనిసరి



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తిరస్కరించింది. విచారణ, దర్యాప్తు, తనిఖీల పేరుతో వ్యక్తిని పోలీసుల అదుపులో ఉంచిన సమయాన్ని మినహాయించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చంద్రుర్కర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కీలక తీర్పును వెలువరించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను పోలీసులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణం 22(2) ప్రకారం అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఈ గడువును లెక్కించేటప్పుడు న్యాయస్థానానికి తరలించేందుకు పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని పేర్కొంది. పోలీసుల విచారణ కోసం అదుపులో ఉంచిన సమయాన్ని పక్కనపెట్టి, అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును ప్రారంభించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే, ఇతర చట్టబద్ధమైన నిర్బంధ ఉత్తర్వులు లేని పక్షంలో సంబంధిత వ్యక్తిని విడుదల చేయాల్సి ఉంటుందని పేర్కొంది. పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్లు కచ్చితమైన పర్యవేక్షణ చేపట్టాలని ధర్మాసనం సూచించింది. వ్యక్తిని వాస్తవంగా ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారు, అధికారికంగా అరెస్టు ఎప్పుడు నమోదు చేశారు, ఎంతసేపు పోలీసుల నిర్బంధంలో ఉంచారు, నిర్ణీత గడువులోగా న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారా అనే అంశాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. అరెస్టు పత్రాల్లో పేర్కొన్న సమయాన్ని మాత్రమే కాకుండా వాస్తవ నిర్బంధ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. త్రిపురలో మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులో నలుగురి అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. కేసు వివరాల ప్రకారం 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు అధికారికంగా అరెస్టు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో 24 గంటల గడువును ఏ సమయం నుంచి లెక్కించాలన్న అంశం వివాదంగా మారింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం అధికారిక అరెస్టు నమోదు సమయం కాకుండా వాస్తవంగా నిర్బంధించిన సమయమే ప్రామాణికమని స్పష్టం చేసింది. పోలీసులు అరెస్టు నమోదు చేయడంలో జాప్యం చేయడం ద్వారా రాజ్యాంగపరమైన గడువును పొడిగించుకునే అవకాశం లేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛ, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణలో ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విచారణ పేరుతో వ్యక్తులను గంటల తరబడి అదుపులో ఉంచి, ఆ తర్వాత అరెస్టు నమోదు చేసే విధానంపై న్యాయపరమైన పర్యవేక్షణకు ఈ తీర్పు ప్రాధాన్యం కల్పించింది.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది!

- **గోకుల్ డెయిరీ ఎన్నికలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు**
- **పాడి రైతుల తీర్పును తారుమారు చేస్తున్నారని మండిపాటు**
- **ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్ల నియామకంపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్**



న్యూ ఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్): ఇటీవల మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో జరిగిన గోకుల్ మిల్క్ కోఆపరేటివ్ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేయడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, డైరెక్టర్ల బోర్డులో మెజారిటీని అక్రమంగా దక్కించుకోవడానికి ఎన్నికలు ముగిసిన తర్వాత నిబంధనలను మార్చారని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు రాహుల్ గాంధీ గురువారం తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాడి రైతులు స్పష్టంగా బీజేపీ కూటమిని ఓడించారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత బీజేపీ నిబంధనలను మార్చిందని మండిపడ్డారు. ఇందుకోసం బోర్డులో నలుగురు నామినేటెడ్ డైరెక్టర్లను నియమించి, మొత్తం సభ్యుల సంఖ్యను 12 నుంచి 16కి పెంచి మెజారిటీని దొంగిలించిందని విమర్శించారు. ఇది ముమ్మాటికి పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమేనని, ప్రజా తీర్పును కల్తీ చేయడమేనని స్పష్టం చేశారు. కేవలం అధికారాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని, రైతుల ఓట్లను దొంగిలించే వారిని దేశంలోని రైతాంగం ఎప్పటికీ మరచిపోదని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఈ అంశంపై స్పందిస్తూ, ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వం తనకిష్టమొచ్చినట్లు నిబంధనలను ఎలా మారుస్తుందని ప్రశ్నించారు. అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ (కొల్హాపుర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం) ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గాను కాంగ్రెస్ నాయకుడు సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ దక్కించుకుందని గుర్తుచేశారు. అధికార మహాయుతి ప్యానెల్ కేవలం 12 స్థానాలకే పరిమితమైందని వివరించారు. మహాయుతి మద్దతు ఉన్న డైరెక్టర్లు గైర్హాజరై ఛైర్మన్ ఎన్నికను అడ్డుకున్న తర్వాత, నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. అయితే ఎన్నికైన బోర్డును సజావుగా పనిచేయనివ్వకుండా, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ ఉన్న సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించే కొత్త ప్రతిపాదనకు మహారాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, అందులో నలుగురికి ఓటింగ్ హక్కు కల్పించి తీర్పును తారుమారు చేయడానికి చూస్తోందని ఆరోపించారు. ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటానికి తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు పవన్ ఖేడా వెల్లడించారు. ఇదిలా ఉండగా, సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ల చోరీ' అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు కథ 'హక్కుల చోరీ' అని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ మంత్రి పదేపదే చెప్పడం మోదీ ప్రభుత్వ అధికారిక విధానమేనా అని జైరాం రమేశ్ తీవ్రంగా ప్రశ్నించారు.



2030 నాటికి వ్యర్థరహిత అంతరిక్షం!

దిశానిర్దేశం చేసిన మంత్రి జితేంద్ర సింగ్

గచ్చిబౌలిలో స్పేస్ బేస్-1 ప్రారంభం

వర్చువల్ విధానంలో లాంఛనంగా..

40 బిలియన్ డాలర్లకు అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ

హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్) : అంతరిక్ష వ్యర్థాల తొలగింపులో భారత్ కీలక ముందడుగు వేస్తోందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. రాబోయే 2030 నాటికి వ్యర్థరహిత అంతరిక్షం సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన కాస్మోసర్వ్ స్పేస్ బేస్-1 కేంద్రాన్ని ఆయన వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంతరిక్ష రోబోటిక్స్, ఉపగ్రహాల సేవలు, వ్యర్థాల తొలగింపు సాంకేతికతపై ఈ కేంద్రంలో లోతైన పరిశోధనలు జరగనున్నాయని వివరించారు. భారత్ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం 9 బిలియన్ డాలర్లకు చేరిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. వచ్చే దశాబ్దంలో ఇది ఏకంగా 40 నుంచి 45 బిలియన్ డాలర్లకు పెరగనుందని మంత్రి అంచనా వేశారు. దేశంలో అంతరిక్ష అంకుర సంస్థలు వేగంగా ఎదుగుతున్నాయని, వీటి సంఖ్య దాదాపు 450కి చేరిందని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ప్రపంచ ఇంధన శక్తిగా భారత్!

బీఆర్ఈ సమ్మిట్‌లో మంత్రి ప్రహ్లాద్ జోషి

500 గిగావాట్ల శిలాజేతర ఇంధన లక్ష్యం

అవసరమైన 220 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

గ్రీన్ హైడ్రోజన్ రంగంపై ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ ప్రపంచంలోనే ఓ కీలక శక్తిగా ఎదుగుతోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. 135 దేశాల ప్రతినిధులు పాల్గొన్న ప్రతిష్టాత్మక బీఆర్ఈ సమ్మిట్-2026 సదస్సులో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఈ భారీ సదస్సులో 75 వేల మందికి పైగా సందర్శకులు, 400కు పైగా వివిధ సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రసంగిస్తూ.. భారత్ నిర్దేశించుకున్న 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన లక్ష్యాన్ని చేరుకునేందుకు సుమారు 220 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు అవసరమని వివరించారు. రాబోయే రోజుల్లో పర్యావరణ హితమైన గ్రీన్ హైడ్రోజన్, ఇంధన నిల్వ, సౌర విద్యుత్, పవన విద్యుత్ ఉత్పత్తి రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వెల్లడించారు. దేశీయంగా తయారీ రంగాన్ని మరింత ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

జార్ఖండ్‌లో హై అలర్ట్!

నవంబర్‌లో మావోయిస్టుల కార్యక్రమాలు

వరుసగా మూడు వారాల పాటు సప్తాహాలు

కట్టుదిట్టమైన భద్రత.. పోలీసుల గస్తీ

జిల్లాల ఎస్పీలకు ఐజీ ఆదేశాలు



రాంచీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : జార్ఖండ్‌లో నిషేధిత సీపీఐ (మావోయిస్టు) కార్యకలాపాలు మళ్లీ పెరుగుతున్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నవంబర్‌లో మూడు వారాల పాటు మావోయిస్టులు వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం అందడంతో రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు నిఘా పెంచాలని అన్ని జిల్లాల ఎస్పీలను పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆదేశించింది.

పోలీస్ ఐజీ (ఆపరేషన్స్) నవంబర్ 5న జారీ చేసిన రహస్య లేఖ ప్రకారం.. నవంబర్ 8 నుంచి 15 వరకు 'ఖూనీ క్రాంతి సప్తాహ్', 16 నుంచి 22 వరకు 'దమన్ విరోధీ సప్తాహ్', 24 నుంచి 30 వరకు 'షహీద్ సప్తాహ్' నిర్వహించేందుకు మావోయిస్టులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాంచీ, జంషెడ్‌పూర్, ధన్‌బాద్ ఎస్ఎస్పీలతో పాటు జార్ఖండ్ జాగ్వార్ విభాగం, రైల్వే పోలీసులను కూడా అప్రమత్తం చేశారు.

దుబాయ్‌లో రవి ఉప్పల్ అరెస్ట్!

- **మహదేవ్ యాప్ కేసులో కీలక పరిణామం**
- **రూ.94 వేల కోట్ల లావాదేవీలపై దర్యాప్తు**
- **హవాలా వ్యవహారంలో కీలకంగా నిందితుడు**
- **నేతలు, అధికారులకు భారీగా ముడుపులు!**



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ యాప్ సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్‌ను దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భారత భద్రతా వర్గాలకు సమాచారం అందింది. మరో ప్రధాన నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను ఒమన్ నుంచి భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఉప్పల్ పట్టుబడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా సాగిన ఈ బెట్టింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు వర్గాలకు సంబంధాలున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో ఆరోపణలు వెలుగుచూశాయి. బెట్టింగ్ కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు కొందరు నేతలు రాజకీయ అండదండలు అందించగా, ఉన్నతాధికారులు, పోలీసులకు నెలవారీగా భారీ మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. యాప్ ప్రచారం, సాంకేతిక కార్యకలాపాలను చంద్రకర్ పర్యవేక్షించగా.. రాజకీయ నేతలు, అధికారులతో సెటిల్‌మెంట్లు, హవాలా మార్గాల్లో నగదు బదిలీల బాధ్యతలను ఉప్పల్ చూసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈడీ అంచనాల ప్రకారం మహదేవ్ యాప్, దాని అనుబంధ వేదికల ద్వారా సుమారు రూ.94 వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. ప్రమోటర్లకు రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయం చేరినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఇందులో అధిక భాగం హవాలా మార్గాల్లో విదేశాలకు తరలించగా, కొంత మొత్తం రాజకీయ నాయకులు, అధికారులకు చేరినట్లు ఆరోపణలున్నాయి.

2023 అక్టోబర్‌లో జారీ చేసిన ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఉప్పల్‌ను దుబాయ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామంపై యూఏఈ ప్రభుత్వ వర్గాల నుంచి భారత విదేశాంగ శాఖకు అధికారిక సమాచారం అందాల్సి ఉంది. దౌత్య మార్గాల ద్వారా ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు సంస్థలు చర్యలు చేపట్టాయి. ఉప్పల్‌ను విచారిస్తే బెట్టింగ్ సొమ్ము ఎవరెవరికి చేరింది? రాజకీయ నాయకులు, అధికారుల పాత్ర ఎంత? హవాలా లావాదేవీల వెనుక ఉన్నదెవరు? అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ఆస్తుల సమీకరణకు ఈ నిధులు వినియోగించారన్న ఆరోపణలపైనా విచారణ జరగనుంది.

గడువు దాటితే వదిలేయండి!

- **అరెస్టు సమయం వాదనకు సుప్రీంకోర్టు నో**
- **నిర్బంధించినప్పటి నుంచే 24 గంటల గడువు**
- **ప్రయాణ సమయానికి మాత్రమే మినహాయింపు**
- **పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్ల పర్యవేక్షణ**



న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : ఒక వ్యక్తిని పోలీసులు నిర్బంధించిన సమయం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తోసిపుచ్చింది. విచారణ, దర్యాప్తు, తనిఖీల పేరుతో నిర్బంధించిన సమయాన్ని మినహాయించడానికి వీల్లేదని జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్.చంద్రుర్కర్‌తో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని పేర్కొంది. న్యాయస్థానానికి తీసుకెళ్లేందుకు పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని స్పష్టం చేసింది. గడువు దాటితే సంబంధిత వ్యక్తిని విడుదల చేయాలని, పోలీసులు నిబంధనలు పాటించారా లేదా అన్నది మేజిస్ట్రేట్లు పరిశీలించాలని ఆదేశించింది. త్రిపురలో ఎన్‌డీపీఎస్ కేసులో నలుగురి అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై ఈ తీర్పు వెలువడింది. 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు వారిని నిర్బంధించగా, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు అధికారికంగా అరెస్టు నమోదు చేశారు. అయితే 24 గంటల గడువును నిర్బంధించిన సమయం నుంచే లెక్కించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ద్వేషం పెంచుతున్న హిందూత్వం!

- **హిందూత్వానికి, సనాతన ధర్మానికి వ్యత్యాసం**
- **వసుధైవ కుటుంబకమే సనాతన ధర్మం**
- **ఈవీఎంల రద్దుపై దిగ్విజయ్ సింగ్ డిమాండ్**
- **ముగిసిన సత్య సనాతన స్వాభిమాన్ యాత్ర**




భోపాల్, నవంబర్ 5 (సమయం న్యూస్) : హిందూత్వం సమాజంలో ద్వేషాన్ని పెంచుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ విమర్శించారు. ప్రజలు హిందూత్వ భావజాలానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మానికి, హిందూత్వానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని, ఈ రెండింటినీ ఒకటిగా చిత్రీకరించడం సరికాదని ఆయన అన్నారు. సనాతన ధర్మం అసలు సందేశాన్ని ప్రజలకు వివరించకపోతే వారు హిందూత్వం వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉజ్జయిని నుంచి అయోధ్య వరకు సుమారు వెయ్యి కిలోమీటర్ల మేర ఆయన చేపట్టిన 'సత్య సనాతన స్వాభిమాన్ యాత్ర' తొలి విడత పూర్తిచేసుకుని తన స్వగ్రామం రాఘోగఢ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కుమారుడు జైవర్ధన్ సింగ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభలో దిగ్విజయ్ మాట్లాడుతూ.. 'వసుధైవ కుటుంబకం' అనేదే సనాతన ధర్మం ప్రధాన సందేశమని వివరించారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే భావనను సనాతన ధర్మం చాటుతుందని చెప్పారు. 80 ఏళ్ల వయసులో పాదయాత్ర చేపట్టడానికి రెండు కారణాలున్నాయన్న ఆయన.. దేశంలో ప్రజాస్వామ్యానికి బదులుగా నిరంకుశ ధోరణులు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఓట్ల అక్రమాలపై రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలను ప్రస్తావిస్తూ.. ఈవీఎంలను రద్దు చేసి రాబోయే ఎన్నికలను బ్యాలెట్ పత్రాలతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పేరుతో హిందూత్వ భావజాలాన్ని రుద్దడాన్ని వ్యతిరేకించడమే తన యాత్ర మరో లక్ష్యమని స్పష్టం చేశారు. 1992లో అద్వాణీ చేపట్టిన రథయాత్రను మహంత్ లాల్‌దాస్ వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. రామమందిర నిర్మాణానికి సేకరించిన రూ.1,400 కోట్ల విరాళాల్లో కేవలం రూ.8.29 కోట్లకు మాత్రమే లెక్కలు చూపించారని ఆయన ఆరోపించారు.

రాష్ట్రాలకు ముందస్తు నిధులు!

- **28 రాష్ట్రాలకు రూ.1.09 లక్షల కోట్లు**
- **ఐదు రోజుల ముందే పన్నుల వాటా**
- **ఏపీకి రూ.4,597 కోట్లు, తెలంగాణకు రూ.2,370 కోట్లు**
- **అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు కేటాయింపు**

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సమయం న్యూస్) : పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ముందస్తుగా పన్నుల వాటా నిధులను విడుదల చేసింది. సాధారణంగా నవంబర్ 10న విడుదల చేయాల్సిన నిధులను ఐదు రోజుల ముందుగానే నవంబర్ 5న అందుబాటులోకి తెచ్చింది. దేశంలోని 28 రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ.1,09,019 కోట్లను కేటాయించింది. రాష్ట్రాల ఆర్థిక అవసరాలకు ఊరటనివ్వడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా మూలధన వ్యయాలను వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు కలగనుంది.

ఈ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.4,597 కోట్లు, తెలంగాణకు రూ.2,370 కోట్లు లభించాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ.6,967 కోట్ల నిధులు అందనున్నాయి. రాష్ట్రాల వారీగా అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.19,208 కోట్లు, బీహార్‌కు రూ.10,845 కోట్లు కేటాయించారు. పండుగల సమయంలో నిధులను ముందుగానే విడుదల చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు ఆర్థికంగా తోడ్పాటు లభించనుంది.




నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి లింగమూర్తి

నేడు కవి కేసరి వర్ధంతి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి.


ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది. సమైక్యరాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు. ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు. కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభాపురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహశాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందాడు. వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

నేడు అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ నివారణ దినోత్సవం



అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీ వల్ల స్థానిక జీవజాలం, స్థానిక జనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం మరియు వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేక పోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది.

ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు మరియు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించి పోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, మరియు ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూసమ–ర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరువు వంటి ప్రతికూల మార్పులు చోటు. చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించక పోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది. కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాలు ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం స్వంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి. పర్యావరణ అవగాహన కార్యక్రమాలు: పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవనశైలిని సవరించు కోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ. పడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉ పయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయు కాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, మరియు ప్రజలు కలిసి కృషి చేయాలి. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించ గలుగుతాం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ధన త్రయోదశితో దీపారాధనకు శ్రీకారం

దీపావళి పండగ సందర్భంగా వరుసగా ఐదు రోజులు పర్వదినాలుగా భావించ బడుతున్న క్రమంలో మొదటిదైన ధన త్రయోదశి ప్రాముఖ్యతను సంత రించుకున్నది. ఆది వైద్యుడైన ధన్వంతరి జయంతి కావడం చేత ధన్వంతరి త్రయోదశిగా భావిస్తారు. అందుకే వైద్యులు ఘనంగా పూజిస్తారు. మహావిష్ణువు వామనావతారం ధరించి, బలిచక్రవర్తిని పాతాళానికి అణగదొక్కిందీ ఈరోజేనని ప్రతీతి. అందుకే 'త్రివిక్రమ త్రయోదశి'గా పిలవడమూ పరిపాటి. ఈ రోజుకు ధన్వంతరీ త్రయోదశి, యమ త్రయోదశి, కుబేర త్రయోదశి, ఐశ్వర్య త్రయోదశి వంటి పేర్లూ ఉ న్నాయి. 'అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. అకాల మత్యుభయాలు లేకుండా, సిరి సంపదలతో విలసిల్లాలి' అనే శు భాకాంక్షలకు నేపథ్యమే ధనత్రయోదశి పర్వదినం. సంపదలతో తుల తూగడానికి లక్ష్మీదేవినీ, సంపూర్ణ ఆరోగ్యంకోసం ధన్వంతరినీ, సుస్థిర ఆర్థిక వృద్ధికి కుబేరుణ్నీ, అపమృత్యు బాధలు తొలగడానికి యమధర్మరాజును వివిధ రీతుల్లో ధన త్రయోదశినాడు పూజించడం సాంప్రదాయం.



గుజరాతీయులకు సంవత్స రాది. అమావేర్ జ్యోతిషీ త్రయోదశిగా పేర్కొంది. అనగా పదమూడవ తిథి, పాశ్చాత్యులు పదమూడవ సంఖ్య మంచిది కాదని భావిస్తుండగా, హిందువులు మాత్రం మంచి రోజుగా తలుస్తారు. ధన త్రయోదశిని గుజరాతీయులు "ధన్ తేరస్" అని పిలుస్తారు. పొరుగు వారైన మహారాష్ట్రులు ధన త్రయోదశిని గొప్పగా జరుపు కుంటారు. ఆంధ్రావనిలోనూ పవిత్రమైన దినంగా ఆచరిస్తారు. ఈరోజు తమ ఇళ్ళను శుభ్ర పరుస్తారు. అలికి, కడిగి, ఇళ్ళముందు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దుతారు. శుచిగా, శుభ్రంగా ఉంచితే లక్ష్మీదేవి తమ ఇంటికి రాగలదని విశ్వాసం. ఈనాటి నుండి దీపాలను వెలిగించడం ప్రారంభం అవుతుంది. ఈనాడు అభ్యంగన స్నానం చేసి, మంచి బట్టలు వేసుకుని, సుగంధ ద్రవ్యాలు రాసుకుని, ధన పూజ చేస్తారు. ఇంట్లో ఉన్న బంగారు, వెండి వస్తువులను పాలతో కడుగుతారు. శుభ్రంగా పూజా స్థలంలో ఉంచుతారు. షావుకార్లు వ్యాపారులు ఈదినం తమ సరుకుల నిలువ, రొక్కం నిలువ సరి చూసుకుని, లక్ష్మీ పూజ చేస్తారు.

గుజరాత్, మహారాష్ట్రలలో, మాళవదేశంలో పండగ ఆచరణ అనాదిగా ఉంది. దీపావళి నుండి కొత్త ఖాతాలు, లెక్కలు ప్రారంభిస్తారు. వర్షాలు చాలా వరకు వెనకపట్టు పడుతుండడంతో, ఇక్కకు వెల్లవేసి, అలంకరణలు చేస్తారు. యమలోకం లోని పితరులు కూడా ఈ పండగకు తమ పూర్వ గృహాలకు తిరిగి వస్తారని మాళవ దేశస్తుల విశ్వాసం. ధన త్రయోదశి నాడు సాయంకాలం తమ ఇళ్ళ ముందు దక్షిణ దిశగా దీపాలు ఉంచుతారు. వచ్చే పితృ దేవతలకు దీపాలు దారి చూపిస్తా యని నమ్మకం. ఇంటి యజమాని, తల్లిదండ్రులు ఉంటే దక్షిణ దిక్కుగా పెట్టరు. ఈనాడు ఇంటిలో ఒక్క దీపమైనా పెడతారు. వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సహస్ర నామార్చ నలు, లక్ష్మీ సూక్త మూలమంత్ర సంపుటీకరణం శ్రీసూక్త పూజలు గావిస్తారు. ప్రత్యేక దీపాలంకరణ ఆరాధనలు నిర్వహిస్తారు. ఆయుర్వేద విజ్ఞానానికి ధన్వంతరి ఆరాధ్య దైవం. క్షీరసాగర మథనం సమ యంలో మహావిష్ణువు అంశావతారంగా అమృత కలశ హస్తుడై సమస్త జనావళికి రోగ నివారణ ద్వారా ఆరోగ్యాన్ని ప్రసాదించడానికి ధన్వంతరి ఆవిర్భవించిన దినాన్ని హిందువులు ధన త్రయోదశి అని పండుగ జరుపుకుంటారు. గృహాలలో, నదీ సాగర తీరాలలో, వైద్య శాలలలో తూర్పు దిక్కుగా కలశ స్థాపన చేసి, ధన్వంతరిని ఆవాహన గావించి, ధన్వంతరిని ధ్యానించాకనే యథాశక్తి షోడశోపచార సహిత పురుశసూక్త విధానంతో అర్చన జరిపి, మత్స్య పురాణాంతర శ్లోక పఠనం చేసి, గరుడ పురాణాంతర్గత ధన్వంతరి సార్థకత కథ పాఠాయణం చేసి, వైద్యులకు, పెద్దలకు తాంబూలాలు సమర్పించి, ఘృతయుక్త పెసర పులగం నివేదన చేసి, భుజించడం ఆచారం. అలాగే లక్ష్మీదేవి ధనప్రదాతగా ఆవిష్కారమైన రోజుగా, దన త్రయోదశినాడు బంగారు, వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దీంతో ఏడాది పొడవునా తమకు ధనలక్ష్మీ కృపాకటాక్షాలు చేకూరుతాయని విశ్వసిస్తారు...

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

కీపర్ చేసిన చిన్న తప్పు..

గెలుపోటములే తారుమారు!

- చివరి బంతికి అనూహ్య మలుపు..
- సూపర్ ఓవర్ లేకుండానే రెనెగేడ్స్ విజయం
- వికెట్ల ముందుకు వచ్చి బంతిని అందుకున్న హోబర్ట్ వికెట్ కీపర్
- నిబంధనల ఉల్లంఘనతో నోబాల్ ప్రకటించిన అంపైర్
- చేతిదాకా వచ్చిన అవకాశం చేజారడంతో హరికేన్స్‌కు నిరాశ
- మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అరుదైన ఘటన



హోబర్ట్, నవంబర్ 5 (సమయం న్యూస్): మహిళల బిగ్ బాష్ లీగ్‌లో ఓ అరుదైన ఘటన మ్యాచ్ ఫలితాన్నే తారుమారు చేసింది. హోబర్ట్ హరికేన్స్, మెల్‌బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో చివరి బంతికి వికెట్ కీపర్ చేసిన చిన్న పొరపాటు హోబర్ట్ జట్టు ఓటమికి కారణమైంది. మ్యాచ్ టై అయి సూపర్ ఓవర్‌కు దారితీస్తుందని భావించిన సమయంలో వికెట్ కీపర్ లిజెల్ లీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో అంపైర్ నోబాల్ ప్రకటించారు. దీంతో అదనపు పరుగు లభించిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్ అనూహ్య విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హోబర్ట్ హరికేన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ నికోలా కేరీ అద్భుతంగా రాణించి 43 బంతుల్లో 10 ఫోర్లతో 62 పరుగులు సాధించింది. ఆమె అర్ధశతకంతో హోబర్ట్ ప్రత్యర్థి ముందు 155 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌కు ఓపెనర్ హేలీ మాథ్యూస్ అర్ధశతకంతో శుభారంభం అందించింది. అయితే మధ్య ఓవర్లలో వరుసగా వికెట్లు కోల్పోవడంతో రెనెగేడ్స్ ఒత్తిడిలో పడింది. 101 నుంచి 138 పరుగులకు చేరుకునే క్రమంలో ఐదు కీలక వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది. చివరి బంతికి రెనెగేడ్స్ విజయానికి ఒక్క పరుగు అవసరమైంది. అప్పటికే ఇరు జట్ల స్కోర్లు 154 పరుగులతో సమమయ్యాయి. నికోలా కేరీ వేసిన ఆఖరి బంతిని డియాండ్రా డాటిన్ సరిగా ఆడలేకపోయింది. బంతిని వికెట్ కీపర్ లిజెల్ లీ అందుకోవడంతో బ్యాటర్లు పరుగు సాధించలేకపోయారు. దీంతో మ్యాచ్ టై అయిందని, విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్ నిర్వహించాల్సి ఉంటుందని ఇరు జట్లు భావించాయి. అయితే అదే సమయంలో మూడో అంపైర్ బంతికి సంబంధించిన దృశ్యాలను పరిశీలించడంతో అసలు మలుపు చోటుచేసుకుంది. దృశ్యాలను పరిశీలించిన అంపైర్‌కు వికెట్ కీపర్ లిజెల్ లీ బంతిని అందుకునే సమయంలో తన చేతులను వికెట్ల ముందుకు తీసుకొచ్చినట్లు కనిపించింది. క్రికెట్ నిబంధనల్లోని 27.3 ప్రకారం బౌలర్ వేసిన బంతి బ్యాటర్‌ను లేదా బ్యాట్‌ను తాకే వరకు, వికెట్లను దాటే వరకు లేదా బ్యాటర్ పరుగు కోసం ప్రయత్నించే వరకు వికెట్ కీపర్ పూర్తిగా వికెట్ల వెనుకే ఉండాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే అంపైర్ నోబాల్ ప్రకటించే అవకాశం ఉంటుంది. లిజెల్ లీ చేతులు వికెట్ల రేఖను దాటి ముందుకు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో అంపైర్ నోబాల్ ప్రకటించారు. దీంతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ ఖాతాలో అదనంగా ఒక పరుగు చేరింది. ఫలితంగా సూపర్ ఓవర్ అవసరం లేకుండానే రెనెగేడ్స్ విజయం సాధించింది. చివరి బంతి వరకు పోరాడిన హోబర్ట్ హరికేన్స్‌కు వికెట్ కీపర్ చేసిన పొరపాటు తీవ్ర నిరాశ మిగిల్చింది. అప్పటివరకు మ్యాచ్‌ను సమం చేసిన ఆనందంలో ఉన్న హోబర్ట్ ఆటగాళ్లు అంపైర్ నిర్ణయంతో నిరాశకు గురయ్యారు. మరోవైపు ఓటమి అంచుల నుంచి అనూహ్యంగా విజయం దక్కడంతో రెనెగేడ్స్ ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. క్రికెట్‌లో ఒక్క చిన్న పొరపాటు కూడా మ్యాచ్ ఫలితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

కాలం ఎవరికీ ఆగదు

విరాట్ కోహ్లీ ఆఖరి పోరాటం

అయినా ఇంకా 14 కొట్టొచ్చు ఇలా!



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్): టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ ఇప్పటికే ఎన్నో చారిత్రాత్మక రికార్డులు, మైలురాళ్లతో నిండిపోయింది. వన్డే ప్రపంచ కప్, టీ20 ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టైటిళ్లను అందుకున్న కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున ఐపీఎల్ ట్రోఫీని కూడా ముద్దాడాడు. దీంతో తన సుదీర్ఘ కెరీర్‌లో చాలా కాలంగా ఎదురుచూస్తున్న మరో పెద్ద కలను నెరవేర్చుకున్నాడు. అయినప్పటికీ కోహ్లీ ఆటలో మాత్రం ఇప్పటికీ అదే చెక్కుచెదరని దూకుడు కనిపిస్తోంది. 38 ఏళ్ల వయసులోనూ పరుగుల వేటను కొనసాగిస్తూ సరికొత్త రికార్డుల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాడు. సాధారణంగా 38 ఏళ్ల వయసులో చాలామంది క్రికెటర్లు ఆటకు వీడ్కోలు పలికి కామెంటేటర్లుగా, విశ్లేషకులుగా మారుతుంటారు. కానీ కింగ్ కోహ్లీ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా మైదానంలోనే తన అసమాన సత్తా చాటుతున్నాడు. ఫిట్‌నెస్, క్రమశిక్షణ, పరుగుల కోసం తపన, మైదానంలో చురుకుదనం.. ఇలా ప్రతి విషయంలోనూ తన ప్రత్యేకతను కాపాడుకుంటున్నాడు. వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తడం, ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడం, మైదానంలో నిరంతరం ఉత్సాహంగా కనిపించడం వంటి లక్షణాలు అతడిలో అలాగే ఉన్నాయి. అయితే కాలం ఎవరికీ ఆగదు కాబట్టి, 2027 వన్డే ప్రపంచ కప్ కోహ్లీ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి టోర్నీ కావచ్చని క్రికెట్ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రపంచ కప్ ట్రోఫీని మరోసారి అందుకుని కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలనే లక్ష్యం అతడికి ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. దానికి తోడు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 అంతర్జాతీయ సెంచరీల రికార్డు కూడా కింగ్ ముందున్న మరో ప్రధానమైన సవాలు. ప్రస్తుతం విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 86 సెంచరీలు సాధించాడు. సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల ప్రపంచ రికార్డును సమం చేయాలంటే మరో 14 శతకాలు సాధించాల్సి ఉంది. టెస్టులు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు వీడ్కోలు పలికిన తర్వాత ఈ



రికార్డును అందుకోవడం కోహ్లీకి మరింత కష్టంగా మారింది. అయినప్పటికీ 2025లో టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత వన్డేల్లో అతడి బ్యాట్ నుంచి ఏకంగా నాలుగు సెంచరీలు రావడం అభిమానుల్లో సరికొత్త ఆశలు రేకెత్తించింది. దక్షిణాఫ్రికాతో 2025 నవంబర్ 30న రాంచీలోని జేఎస్‌సీఏ స్టేడియంలో జరిగిన వన్డేలో కోహ్లీ 135 పరుగులు చేశాడు. ఇది అతడి 52వ వన్డే సెంచరీ కాగా, అంతర్జాతీయ కెరీర్‌లో 83వది. ఆ తర్వాత డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 102 పరుగులు చేసి 53వ వన్డే శతకాన్ని, 84వ అంతర్జాతీయ సెంచరీని నమోదు చేశాడు. అనంతరం 2026 జనవరి 18న ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో మరోసారి 102 పరుగులతో మెరిశాడు. ఇది అతడికి 54వ వన్డే సెంచరీ, 85వ అంతర్జాతీయ శతకం. ఇక 2026 సెప్టెంబర్ 27న తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో వెస్టిండీస్‌పై అజేయంగా 139 పరుగులు చేసి 55వ వన్డే సెంచరీని, 86వ అంతర్జాతీయ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నాలుగు సెంచరీలు కేవలం 16 మ్యాచ్‌ల్లోనే రావడం విశేషం. అంటే ప్రతి నాలుగు వన్డేలకు ఒక సెంచరీ చొప్పున సాధించాడు. ఇదే స్థాయి ప్రదర్శనను కొనసాగిస్తే 100 సెంచరీల రికార్డు దిశగా అతడు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. 2027 వన్డే ప్రపంచ కప్‌కు ముందు భారత్ ఇంకా పలు వన్డే సిరీస్‌లు, టోర్నీల్లో పాల్గొనాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో నాలుగు వన్డేలు, శ్రీలంకతో మూడు, జింబాబ్వేతో మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. అలాగే 2027లో వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఆసియా కప్‌లో భారత్ గరిష్ఠంగా ఏడు మ్యాచ్‌లు ఆడవచ్చు. వీటితో పాటు బీసీసీఐ ఖరారు చేయని మరో ఆరు వన్డేలు కూడా షెడ్యూల్‌లో చేరే అవకాశం ఉంది. ఇవన్నీ కలిపి చూస్తే 2027 ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు విరాట్ కోహ్లీ సుమారు 30 నుంచి 35 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికాలో జరగనున్న ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్ వరకు చేరితే మరో 13 మ్యాచ్‌లు తోడవుతాయి. ప్రపంచ కప్ ముగిసే వరకు అతడికి 30 నుంచి 35 వన్డేలు ఆడే అవకాశం ఉంటే, ప్రతి రెండున్నర మ్యాచ్‌లకు ఒక సెంచరీ చొప్పున సాధించాల్సి ఉంటుంది. ఇది అత్యంత కష్టమైన విషయమైనప్పటికీ, కోహ్లీ గతంలో నెలకొల్పిన ప్రమాణాలు, తిరుగులేని ప్రదర్శనను చూస్తే అసాధ్యమని చెప్పలేం. మొత్తంగా 2027 ప్రపంచ కప్ కోహ్లీ కెరీర్‌లో అత్యంత కీలక మలుపుగా మారనుంది. ఒకవైపు దేశానికి మరో ప్రపంచ కప్ అందించాలనే లక్ష్యం, మరోవైపు సచిన్ 100 అంతర్జాతీయ సెంచరీల రికార్డును అందుకోవాలనే అరుదైన అవకాశం ఉన్న ఈ సమయంలో కోహ్లీ తన బ్యాటింగ్ ప్రయాణాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తాడో చూడాలి.



జనవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్

వడోదర, ముంబై వేదికలుగా ఐదో సీజన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ జనవరి 14 నుంచి మొదలుకానుంది. వడోదర, ముంబై వేదికలుగా ఐదో సీజన్‌ను నిర్వహించనున్నట్లు బీసీసీఐ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వడోదరలోని బీసీఏ స్టేడియంలో 11 మ్యాచ్‌లు జరుగనుండగా ముంబైలోని బ్రబోర్న్ స్టేడియం లీగ్ దశలోని మిగిలిన 9 మ్యాచ్‌లతో పాటు నాకౌట్, ఫైనల్ పోరుకు ఆతిథ్యమివ్వనుంది. 14న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. ముంబై ఇండియన్స్‌తో జరిగే పోరుతో టోర్నీ ఆరంభం కానుంది. జనవరి 24 దాకా వడోదరలో సాగే ఈ టోర్నీ 26 నుంచి బ్రబోర్న్‌కు షిఫ్ట్ అవుతుంది. ఫిబ్రవరి 3 దాకా లీగ్ దశ మ్యాచ్‌లు జరుగనుండగా 5న ఎలిమినేటర్, 7న ఫైనల్ జరుగుతుంది.



ప్రిక్వార్టర్స్‌కు అన్మోల్, తన్వి


తొలిరౌండ్‌లోనే ప్రణయ్ ఔట్

యోసు (సౌత్‌కొరియా): బీడబ్ల్యూఎఫ్ కొరియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అన్మోల్ 21-19, 21-18తో రాచెల్ (కెనడా)ను ఓడించగా మరో పోరులో తన్వి 21-16, 12-21, 21-17తో మనామి సుయిజు (జపాన్)పై పోరాడి గెలిచింది. తదుపరి రౌండ్‌లో అన్మోల్.. జపాన్ స్టార్ షట్లర్ అకానె యమగుచితో తలపడనుండగా తన్వి సైతం జపాన్‌కే చెందిన ఐదో సీడ్ హినా అకెచితో ఆడనుంది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలు మోస్తున్న సీనియర్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్.. 15-21, 21-23తో యెు టె బిన్ (సౌత్ కొరియా) చేతిలో ఓడి తొలిరౌండ్‌కే ఇంటిబాట పట్టాడు.

పూజ ఆల్‌రౌండ్ షో

పుణె: మొదట బంతితో ప్రత్యర్థిని పడగొట్టి ఆ తర్వాత బ్యాట్‌తో అదరగొట్టిన వంక పూజ హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించింది. సీనియర్ విమెన్స్ క్రికెట్ టీ20 టోర్నీ సందర్భంగా పూజ ఆల్‌రౌండ్ షోతో హైదరాబాద్.. పుదుచ్చేరిపై ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. పూజ 4 వికెట్లతో చెలరేగగా మొదట బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి 133 రన్స్‌కే కుప్పకూలింది. ఛేదనలో ఆమె 41 బంతుల్లోనే అజేయంగా 55 రన్స్ చేసింది. ఈ టోర్నీలో నాలుగు వికెట్ల ప్రదర్శన చేయడం ఆమెకు ఇది మూడోసారి కావడం గమనార్హం.





ఆ క్రైమ్‌లో ఇరుక్కున్నా

'దొంగ నా కొడుకు' హీరోయిన్ సుష్మితా శెట్టి

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్): స్టార్ హీరోలతో వందల కోట్ల భారీ బడ్జెట్ సినిమాలు నిర్మించే అగ్ర నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్'.. కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను కూడా ఎంతో ప్రోత్సహిస్తోంది. సరిగ్గా ఈ స్ట్రాటజీతోనే వాళ్ల బ్యానర్ నుంచి వస్తున్న తాజా క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, శ్రీను కంబాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంతో సుష్మితా శెట్టి హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. నవంబర్ 13న ఈ సినిమా థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో, తన క్యారెక్టర్ గురించి హీరోయిన్ సుష్మితా శెట్టి చెప్పిన ఆసక్తికర విషయాలు విశేషంగా నిలిచాయి. 'దొంగ నా కొడుకు' అనే టైటిల్ వినగానే చాలా క్యాచీగా, ఫన్నీగా అనిపించిందని సుష్మితా తెలిపింది. ఈ సినిమాలో తన పాత్ర గురించి వివరిస్తూ.. "ఇందులో నా క్యారెక్టర్ చాలా క్యూట్ అండ్ బబ్లీగా ఉంటుంది. చెప్పాలంటే కొంచెం తింగరి పిల్ల క్యారెక్టర్. హీరో ఈశ్వర్ (మౌళి)ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తుంది. ఆ ప్రేమ కోసం ఎంతకైనా తెగిస్తుంది. తనను తాను చాలా స్మార్ట్ అనుకుంటుంది. కానీ, అదే అతి తెలివితో తెలియకుండానే చాలా ఇన్నోసెంట్‌గా ఒక క్రైమ్‌లో ఇన్వాల్వ్ అయిపోతుంది. నేను సీరియస్‌గా స్మార్ట్‌గా ఏదైనా చేయబోతే.. అది కాస్తా తెరపై ఫుల్ కామెడీగా వర్కవుట్ అవుతుంది" అంటూ తన పాత్రపై క్యూరియాసిటీని పెంచేసింది. తన మూలాలు కన్నడలో ఉన్నప్పటికీ, పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే అని సుష్మితా శెట్టి తెలిపింది. విదేశాల్లో చదువుకునే రోజుల నుంచే థియేటర్ ఆర్ట్స్ చేసిన సుష్మితకు.. దివంగత అందాల తార శ్రీదేవి అతిపెద్ద స్ఫూర్తి అట. డ్యాన్స్ ద్వారా పలికించే హావభావాలే తనను నటన వైపు నడిపించాయని ఆమె చెప్పుకొచ్చింది. ఇక టాలీవుడ్‌లో జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ ల డ్యాన్స్ అంటే తనకు ఎంతో ఇష్టమని మనసులోని మాట బయటపెట్టింది. ఈ సినిమాలో కూడా తను వేసిన ఒక డ్యాన్స్ నంబర్ ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుందని ధీమా వ్యక్తం చేసింది. వెండితెరపై లీడ్ హీరోయిన్‌గా ఇది తన మొదటి సినిమా అని, ఒక నటిగా తనను తాను బిగ్ స్క్రీన్‌పై చూసుకోవడానికి చాలా ఎక్సైటెడ్‌గా ఉన్నానని సుష్మితా తెలిపింది. తొలి సినిమాకే 'మైత్రీ మూవీ మేకర్స్' లాంటి పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని మురిసిపోయింది. కో-స్టార్ మౌళి చాలా టాలెంటెడ్ అని, దర్శకుడు శ్రీను కంబాలకు ఇది మొదటి సినిమా అయినా సెట్స్‌లో ఏమాత్రం టెన్షన్ లేకుండా చాలా కూల్‌గా సినిమాను తెరకెక్కించారని ఆమె కితాబిచ్చింది. సంగీత దర్శకుడు సింజిత్ అందించిన మ్యూజిక్ ఈ క్రైమ్ కామెడీకి ప్రధాన బలం అని సుష్మితా పేర్కొంది. భవిష్యత్తులో తనకు 'మహానటి' తరహాలో అన్ని ఎమోషన్స్ ఉన్న భారీ పాత్రలతో పాటు స్పోర్ట్స్, రొమాంటిక్ కామెడీ, హారర్ థ్రిల్లర్స్ చేయాలని ఉందని తన మనసులోని కోరికను బయటపెట్టింది. ప్రస్తుతం తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తున్న ఈ బ్యూటీ.. నవంబర్ 13న రాబోతున్న 'దొంగ నా కొడుకు' ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని గ్యారెంటీ ఇస్తోంది!



టాలీవుడ్‌ను విమర్శిస్తారా?

రాధికా ఆప్టే కామెంట్స్‌పై పాయల్ రాజ్‌పుత్ సంచలన కౌంటర్!


హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్): తెలుగు చిత్ర పరిశ్రమపై నటి రాధికా ఆప్టే చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ఈ వివాదంపై తాజాగా బోల్డ్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. టాలీవుడ్‌ను విమర్శించే వారిపై తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేస్తూ దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. తాను గర్వించదగిన తెలుగు నటిని అని పాయల్ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసింది. ఒకప్పుడు ఏ ఇండస్ట్రీ అయితే మీకు పేరు, ప్రఖ్యాతులు ఇచ్చిందో.. ఏళ్ల తర్వాత అదే ఇండస్ట్రీ నుంచి అన్నీ పొంది ఇప్పుడు తప్పుగా మాట్లాడటం ఏమాత్రం ధైర్యం అనిపించుకోదని, అది కేవలం కృతఘ్నత మాత్రమే అవుతుందని పాయల్ రాజ్‌పుత్ తీవ్ర స్థాయిలో మండిపడింది. మీ కెరీర్‌ను ప్రారంభించి, మీకు నటనలో లైఫ్ ఇచ్చిన మొత్తం టాలీవుడ్ ఎకోసిస్టమ్‌ను ఏళ్ల తర్వాత నిందించడం ఎంతమాత్రం సరికాదని ఆమె చురకలంటించింది. "ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం టాలీవుడ్ మాత్రమే, నాకు అండగా నిలబడిన ఈ తెలుగు చిత్ర పరిశ్రమకు నేను ఎప్పటికీ అండగా నిలబడతాను" అని పాయల్ గర్వంగా ప్రకటించింది. తనకు లైఫ్ ఇచ్చిన ఇండస్ట్రీని ఎవరైనా పల్లెత్తు మాట అన్నా సహించేది లేదంటూ పాయల్ రాజ్‌పుత్ చేసిన ఈ సెన్సేషనల్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్‌గా మారింది. తెలుగు చిత్ర పరిశ్రమపై ఆమె చూపించిన ఈ అపారమైన అభిమానానికి నెటిజన్లు, సినీ ప్రియులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

నేటి తరానికి నచ్చేలా తీర్చిదిద్దిన దృశ్యకావ్యం!

రామాయణ

రాముడిగా రణ్‌బీర్ కపూర్.. రావణుడిగా యశ్ విశ్వరూపం

సీతగా సాయిపల్లవి ఆకట్టుకునే అభినయం



హైదరాబాద్, నవంబర్ 5 (సమయం న్యూస్): తరాలు, సాంకేతికత మారుతున్న కొద్దీ అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రామాయణం సినిమాగా తెరకెక్కుతూనే ఉంది. అందరికీ తెలిసిన వాల్మీకి రామాయణాన్ని మరోసారి అత్యున్నత సాంకేతిక హంగులతో దర్శకుడు నితీశ్ తివారీ తెరపైకి తీసుకొచ్చారు. మన సంస్కృతిలో భాగమైన ఇతిహాసాన్ని నేటి తరానికి మరింత సులువుగా, స్పష్టంగా అర్థమయ్యేలా చేరువ చేయాలన్న ప్రయత్నం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్ర కథ విషయానికి వస్తే, ముల్లోకాలపై ఆధిపత్యం కోసం దేవతలు, రాక్షసులకు మధ్య యుగాలుగా యుద్ధం కొనసాగుతుంటుంది. అసురుల సైన్యానికి రాకుమారి కైకసి నాయకత్వం వహిస్తుండగా, శ్రీ మహావిష్ణువు ఆశీర్వాద బలంతో దేవతలే పైచేయి సాధిస్తారు. లంకా నగరం దేవతల వశమై, పరిపాలన బాధ్యతలను కుబేరుడికి అప్పజెబుతారు. పరాజయ భారంతో రగిలిపోయిన కైకసి.. సంగీత శాస్త్రాలే ప్రపంచంగా గడుపుతున్న తన కుమారుడు దశాననుడి దగ్గరకు వెళ్లి అసురజాతికి ఎదురుతుణ్ణ అవమానాల గురించి చెబుతుంది. అది విన్న దశానన కఠోరమైన తపస్సు చేసి, అటు అసురులు, ఇటు దేవతల చేతిలో తనకు మరణం ఉండకూడదని బ్రహ్మదేవుడు ప్రసాదించిన వర గర్వంతో లంకా నగరంపై విరుచుకుపడతాడు. ముల్లోకాలకూ తానే అధిపతినని ప్రకటించుకున్న ఆ దశాననుడే రావణుడు. రావణ పట్టాభిషేకం తర్వాత లంకలో చోటు చేసుకున్న పరిణామాలు, దశరథుడి పాలనలోని అయోధ్యలో జరిగిన సంఘటనలు, శ్రీరాముడు పట్టాభిషిక్తుడు కావల్సిన సమయంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. సినిమా అనుభూతి పరంగా, సీతాపహరణం వరకు సాగే ఈ తొలి భాగం ప్రేక్షకుల్ని పూర్తిగా కథా ప్రపంచంలో మమేకం చేస్తుంది. హనుమంతుడి పరిచయం, రామరావణ యుద్ధంతో రాబోయే భాగంపై అంచనాలను పెంచుతుంది. పాత్రలను చూపించడంలో దర్శకుడు ఎలాంటి ప్రయోగాల జోలికి వెళ్లకుండా, మనదైన ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాల కన్నా ఘనంగా, కళ్ళు చెదిరే విజువల్స్‌తో తెరపై ఆవిష్కరించారు. రావణుడి బాల్యం నేపథ్యం ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా మార్చింది. శ్రీరాముడి జననం, బాల్యం, వీరత్వం వంటి ఘట్టాలు ప్రేక్షకుడిని లీనం చేస్తాయి. అసురులైన తాటకి, సుబాహులతో శ్రీరాముడు అడవిలో చేసే యుద్ధం, స్వయంవరం, సీతారాముల వివాహం, ఆపై దశరథుడు, కైకేయి, శ్రీరాముడి మధ్య సాగే సన్నివేశాలు భావోద్వేగాలను పక్కాగా ఆవిష్కరిస్తాయి. విరామం తర్వాత వనవాసం చుట్టూ సాగే ప్రయాణంలో దట్టమైన అడవుల్లో జరిగే యుద్ధ ఎపిసోడ్, రావణుడు మరియు విద్యుత్‌జిహ్వుడు మధ్య సన్నివేశాలు, శూర్పణఖ ఘట్టం, సీతాపహరణ సమయాన జటాయువు మరియు రావణుడి మధ్య పోరాటం ద్వితీయార్ధానికి హైలైట్‌గా నిలిచాయి. పురాణ గాథ అయినప్పటికీ, ఘనమైన విజువల్ హంగుల కారణంగా అద్భుతమైన ఫాంటసీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. నటీనటుల ప్రతిభను పరిశీలిస్తే, శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ ఎంతో ఒదిగిపోయి నటించారు. ఆ పాత్రకు తగినట్టుగా హుందాగా కనిపిస్తూనే భావోద్వేగాలను అద్భుతంగా పండించారు. రావణుడిగా యశ్ వంద శాతం న్యాయం చేశారు. పరిచయ సన్నివేశాలతోనే సినిమాపై బలమైన ప్రభావం చూపించారు. సీతగా సాయిపల్లవి అభినయం కట్టిపడేస్తుంది. లక్ష్మణుడిగా రవి దూబే, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ తమ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. డీఎన్‌జీ అందించిన విజువల్ ఎఫెక్ట్స్, ఏఆర్ రెహమాన్ మరియు హన్స్ జిమ్మర్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ఈ చిత్రంలో విజువల్స్, నటీనటుల అభినయం, యాక్షన్ ఘట్టాలు అత్యంత ప్రధాన బలాలుగా నిలిచాయి. అక్కడక్కడ కథా సన్నివేశాలు కొద్దిగా నెమ్మదిగా సాగినప్పటికీ, మొత్తంగా చూస్తే మన పురాణ గాథలను తెరపై ఎంత ఘనంగా ఆవిష్కరించవచ్చో చాటిచెప్పిన అద్భుత దృశ్యకావ్యం ఈ 'రామాయణ'.

'ధర్మన్' పటాకా



అదిరిపోయే స్టెప్పులతో అలరించడమే కాదు తనదైన నటనతోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన నటించే అవకాశాల్ని అందిపుచ్చుకుంటున్న నాయికీమె. తమిళంతో పాటు హిందీలో వలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి మరో అగ్ర హీరో సినిమా చేరింది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో.. అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న 'ధర్మన్' చిత్రంలో ఆమె నటించనున్నారు. నయనతార, రామ్, సిమ్రాన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తోన్న ఈ సినిమాలో తాజాగా శ్రీలీల చేరినట్టు అధికారికంగా తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. "ఆమెలో ఆ మెరుపు ఉంది, ఆమెలో ఆ పటాకా ఉంది, అందాల శ్రీలీలకు ధర్మన్‌లోకి స్వాగతం" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రాన్ని కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ పై ఆర్.మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతమందిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం అజిత్ కుమార్ ప్రధాన పాత్రలో వస్తున్న 'డేర్ డెవిల్', ధనుష్ 'ఓం' చిత్రాల్లోనూ నటిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**